క్లుప్తంగా...

చట్టాలపై అవగాహన



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి లావణ్య

మేడ్చల్‌రూరల్‌: మండలంలోని గౌడవెల్లి గ్రామంలో బుధవారం మండల లీగల్‌ సర్వీసెస్‌ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో మేడ్చల్‌ 8 ఎంఎం న్యాయమూర్తి లావణ్య, 10 ఎంఎమ్‌ న్యాయమూర్తి పార్థసారథి పాల్గొని గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయపరమైన సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌ సురేందర్‌ ముదిరాజ్‌, మేడ్చల్‌ బార్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి విజయ్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్‌ పెంటమ్మ, న్యాయవాదులు, వార్డు సభ్యులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐటీఐలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి

మేడ్చల్‌రూరల్‌: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ) పలు కోర్సుల్లో రెండో విడత అడ్మిషన్లకు విద్యార్థులు వెబ్‌సైట్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్‌ శైలజ తెలిపారు. ఒక సంవత్సరం విభాగంలో కోపా, డీజిల్‌ మెకానిక్‌, వెల్డర్‌, రెండు సంవత్సరాల కోర్సులకై ఫిట్టర్‌, టర్నర్‌, ఎలక్ట్రీషన్‌, డీసివిల్‌, ఎలక్ట్రానిక్స్‌ మెకానిక్‌ కోర్సులకు ఆన్‌లైన్‌లో ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నవభారత్‌ యువజన సంఘం భవనానికి భూమిపూజ



భవన నిర్మాణదారులకు రూ.3 లక్షలు అందజేస్తున్న భద్రారెడ్డి

ఘట్‌కేసర్‌: ప్రతాపసింగారంలో నవభారత్‌ యువజన సంఘం భవన నిర్మాణానికి మల్లారెడ్డి హెల్త్‌సిటీ చైర్మన్‌ చామకూర భద్రారెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణదారులకు తన సొంత డబ్బు రూ.3 లక్షలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శివశంకర్‌, వెంకట్‌రెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్‌ డైరెక్టర్‌ ధర్మారెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి రమేశ్‌, కొండల్‌రెడ్డి, నాయకులు భిక్షపతిగౌడ్‌, నరేశ్‌గౌడ్‌, స్థానికులు పాల్గొన్నారు.

నాగారంలో మురుగు కాల్వల నిర్మాణం



14వ వార్డులో మురుగు కాల్వల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న చైర్మన్‌ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్‌ పరిధిలోని 14వ వార్డులో సుమారు రూ.3 లక్షల మున్సిపల్‌ నిధులతో చేపట్టనున్న అంతర్గత మురుగు కాల్వల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ బండారి మల్లేష్‌యాదవ్‌, కౌన్సిలర్‌ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

మన మైండ్‌.. కాకూడదు డస్ట్‌బిన్‌

ఇంట్లో చెత్త మాత్రమే కాదు నెట్‌ సాక్షిగా మనం డౌన్‌లోడ్‌ చేసుకుంటున్న బుర్రలోని చెత్త కూడా పారేయాల్సిందే. ఇదే సందేశంతో కావచ్చు.. సిటీలోని పలు డస్ట్‌ బిన్స్‌ దగ్గర కార్ఖానా, రాణిగంజ్‌ వంటి చోట్ల చెత్త డబ్బాల దగ్గర డౌన్‌లోడ్‌, అన్‌లాక్‌, సెర్చ్‌ వగైరా బోర్డులు ఇలా దర్శనమిచ్చాయి. అయితే ఇవి ఎవరు? ఎందుకు ఉంచారు? అనేవి స్పష్టంగా తెలియనప్పటికీ ఓ కంపెనీ ఈ- వేస్ట్‌కు సంబంధించిన ప్రచారం అని తెలుస్తోంది.

– సాక్షి, సిటీబ్యూరో



7 రోజులుగా సమ్మెలో పారిశుద్ధ్య కార్మికులు

సమ్మెలో కార్మికులు..

దుర్వాసనలో పల్లెలు





- గ్రామాల్లో చెత్తా, చెదారంతో నిండిన రోడ్లు, వీధులు
- నగర శివారులోని 619 గ్రామ పంచాయతీల్లో
- 4,779 మంది పారిశుద్ధ్య కార్మికులు

సాక్షి, మేడ్చల్‌ జిల్లా: పల్లెల పరిశుభ్రతకు పాటుపడుతున్న పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు(మల్టీపర్పస్‌ వర్కర్లు) తమ డిమాండ్లను పరిష్కరించాలని ఏడు రోజులుగా సమ్మె చేస్తున్నారు. దీంతో నగర శివారు జిల్లాలైన మేడ్చల్‌ -మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 619 గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. చెత్తను తరలించే వారు లేక ఇళ్ల, వీధులు, రోడ్లపై నిల్వ ఉంటోంది. వర్షాకాలం కావడంతో వ్యాధుల ముప్పు పొంచి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం 2020 సంవత్సరంలో గ్రామాల్లో మల్టీపర్పస్‌ కార్మికులను నియమించింది. జనాభా ప్రకారం ఒక్కో గ్రామంలో ఇద్దరి నుంచి నలుగురి వరకు నియమించింది. వీరు ప్రతి రోజూ వేకువ జాము నుంచి సాయంత్రం వరకు చెత్త సేకరణతో పాటు వివిధ రకాల పనులు చేస్తుంటారు. అయితే న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆరు రోజులుగా నగర శివారులోని మండల కేంద్రాల్లో సమ్మె చేస్తున్నారు. దీంతో వారు రోజువారీగా చేయాల్సిన పనులకు ఆటంకం ఏర్పడుతోంది. మురుగు కాలువలు శుభ్రం చేయడం, ఇంటింటి చెత్త సేకరణ, తరలించడం, డంపింగ్‌ యార్డు నిర్వహణ, హరిత హారంలో భాగంగా మొక్కలకు నీళ్ల పట్టడం వంటి పనులన్నీ నిలిచిపోయాయి. ఇదే క్రమంలో అడపాదడపా కురుస్తున్న వర్షాలతో సీజనల్‌ వ్యాధులు విజృంభించే అవకాశముంది. పంచాయతీ శాఖ అధికార యంత్రాంగం మాత్రం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడం వల్ల పారిశుద్ధ్య లోపంతో రోగాలు ప్రబలే అవకాశం ఉంటుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..

పారిశుద్ధ్య కార్మికుల సమ్మె కారణంగా పేరుకుపోయిన చెత్త, చెదారంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరు రోజులుగా పారిశుద్ధ్య కార్మికులు మండల కేంద్రాల్లో సమ్మెలో భాగంగా వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం వంటావార్పు కార్యక్రమం పేరుతో పారిశుద్ధ్య కార్మికులు ఆందోళన నిర్వహించారు. దీంతో ఎక్కడ వేసిన చెత్త అలాగే ఉండటంతో పరిసర ప్రాంతాలు దుర్గంధంగా మారుతున్నాయి. మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలో శామీర్‌పేట, ఘట్‌కేసర్‌, కీసర, మూడుచింతలపల్లి, మేడ్చల్‌ మండలాల పరిధిలోని 61 గ్రామాల్లోని పలు కాలనీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అలాగే, రంగారెడ్డి జిల్లాలోని 548 గ్రామ పంచాయతీల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. పారిశుద్ధ్య కార్మికుల సమ్మెను అధికార బీఆర్‌ఎస్‌ ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. బీజేపీ, కాంగ్రెస్‌ పార్టీల ప్రజాప్రతినిధులతో సహా వామపక్ష పార్టీలు కార్మికుల సమ్మెకు మద్దతు ప్రకటించటంతోపాటు వారి ఆందోళన కార్యక్రమాల్లో భాగస్వామ్యాన్ని పంచుకుంటున్నారు. వివిధ రకాల దుకాణాలు, మద్యం షాపులకు సంబంధించిన చెత్త, చెదారం రోడ్లు, వీధుల్లో వేస్తుండటంతో అపరిశుభ్రంగా మారుతున్నాయి. అటువైపుగా వెళ్లే వారు, దుకాణదారులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

డిమాండ్లు సాధించే వరకు సమ్మె చేస్తాం..

పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం స్పందించాలి. చొరవ తీసుకుని వారి సమస్యలను పరిష్కరించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించడంతోపాటు పీఎఫ్‌, ఈఎస్‌ఐ, పెన్షన్‌, బీమా సౌకర్యాలు కల్పించాలి. 11వ పీఆర్సీని వర్తింపజేయాలి. ఈ కోర్కెలపై ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె కొనసాగిస్తాం.

– ఉన్ని కృష్ణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం.

పంచాయతీ కార్మికులు సమ్మె చేపట్టడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాం. మేడ్చల్‌ జిల్లాలో సగం మంది కార్మికులు విధుల్లో ఉన్నారు. ప్రత్యామ్నాయంగా 90 కార్మికులను విధుల్లోకి తీసుకున్నాం. పారిశుద్ధ్య పరిరక్షణకు అన్నీ విధాలుగా చర్యలు తీసుకుంటాం.

– రమణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి, మేడ్చల్‌ జిల్లా

గ్రామాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు



యాద్గార్‌పల్లిలో బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మంత్రి చామకూర మల్లారెడ్డి

కీసర: గ్రామాల అభివృద్ధికి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో సుమారు రూ.25 లక్షల నిధులతో యాద్గార్‌పల్లి గ్రామంలోని మెయిన్‌రోడ్డు బీటీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తోందని, ప్రజల అవసరాలను గుర్తించి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్‌ పాలన సంక్షేమం -అభివృద్ధి పట్ల చిత్తశుద్ధితో ముందుకు వెళ్తున్నారని ప్రజలంతా సీఎం కేసీఆర్‌కు, బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలన్నారు. ఉచిత విద్యుత్‌ అవసరం లేదన్న రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్‌కు రైతులు తగిన బుద్ధి చెప్పాలన్నారు. అంతకుముందు యాద్గార్‌పల్లి గ్రామంలో పాదయాత్ర చేపట్టి వివిధ కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ఈద్గా, దేవాలయాలను సందర్శించి పూజలు నిర్వహించారు. జెడ్పీ వైస్‌ చైర్మన్‌ బెస్త వెంకటేష్‌, ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, సర్పంచ్‌లు పుట్టరాజు, ధర్మేందర్‌, ఎంపీటీసీ సభ్యుడు జూపల్లి వెంకటేష్‌, మాజీ సర్పంచ్‌ అక్కపల్లి అర్జున్‌, నేతలు సుదర్శన్‌, అరేపల్లి రాజు, బలిదె రమేష్‌గుప్తా, నాయకపు వెంకటేష్‌, హరీష్‌, బషరత్‌అలీ, భానుచందర్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ ప్రశాంతం

మేడ్చల్‌రూరల్‌: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్‌ఎఫ్‌ఐ బుధవారం విద్యాసంస్థల బంద్‌కు పిలుపునివ్వగా మేడ్చల్‌లో బంద్‌ ప్రశాంతంగా ముగిసింది. ఎస్‌ఎఫ్‌ఐ బంద్‌ పిలుపుతో మేడ్చల్‌, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలతో పాటు మండలంలోని గ్రామాల్లో ప్రైవేటు పాఠశాలలు సెలవు ప్రకటించి స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నాయి. బంద్‌ పాటించని ప్రభుత్వ పాఠశాలలను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బంద్‌ చేయించారు.

ఇంకా పాఠ్యపుస్తకాలకు దిక్కులేదు..

కీసర: వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపుమేరకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బుధవారం విద్యాసంస్థల బంద్‌ నిర్వహించారు. దీంతో కీసర మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాలలు, కళాశాలలు బంద్‌ పాటించాయి. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్‌ మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులైనా విద్యార్థులకు పాఠ పుస్తకాలు అందలేదన్నారు. హాస్టల్స్‌, గురుకులాలకు నోట్‌బుక్స్‌ పంపిణీ జరగలేదన్నారు. చాలా కళాశాలల్లో ల్యాబ్స్‌, లైబ్రరీ వంటి వసతులు లేవన్నారు. ఇన్ని సమస్యల మధ్య విద్యార్థుల చదువు ఎలా సాగుతుందంటూ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.



సరైన వైద్యం అందక వ్యక్తి మృతి

ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన

ఘట్‌కేసర్‌: సరైన వైద్యం అందకపోవడంతోనే వ్యక్తి మృతి చెందాడని మృతుడి బంధువులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి ఎదుట బుధవారం రాత్రి ఆందోళన చేపట్టారు. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం హాజీపూర్‌కు చెందిన జల్లి కుమార్‌(35) ఫిట్స్‌ రావడంతో ఘట్‌కేసర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. వ్యక్తి ఆరోగ్యం విషమించడంతో మెరుగైన వైద్యం కోసం సాయంత్రం వేరే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని ఆరోపిస్తూ మృతుడి బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. సీఐ మహేందర్‌రెడ్డి, అడ్మిన్‌ ఎస్సై అశోక్‌ ఆస్పత్రికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. కుటుంబాన్ని ఆదుకుంటామని ఆస్పత్రి యాజమాన్యం హామీ ఇవ్వడంతో వారు మృతదేహాన్ని తీసుకొని స్వస్థలానికి వెళ్లిపోయారు.



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి అదృశ్యం

మేడ్చల్‌రూరల్‌: వేర్వేరు ఘటనల్లో ముగ్గురు అదృశ్యమైన ఘటన మేడ్చల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. మేడ్చల్‌ సీఐ నర్సింహారెడ్డి వివరాల ప్రకారం అస్సాం రాష్ట్రానికి చెందిన భగీరామ్‌ బర్మా(53) బంధువు, మిత్రులతో కలిసి ఈ నెల 9న మేడ్చల్‌కు వలసవచ్చి మండలంలోని రాయిలాపూర్‌ గ్రామంలోని ఓ కంపెనీలో పనికి చేరారు. 10వ తేదీన రాత్రి నైట్‌ డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన భగీరామ్‌ తిరిగి నివాసం ఉండే గదికి చేరుకోలేదు. దీంతో ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో బుధవారం మేడ్చల్‌ పోలీసులను ఆశ్రయించారు.



భగీరామ్‌(ఫైల్‌)

పరువు పోయిందని లేఖ రాసి..


అమ్మా.. అందరి ముందు నా పరువు పోయిందని లేఖ రాసి ఇంట్లో పెట్టిన యువతి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన మేడ్చల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధి సుతారిగూడలో చోటు చేసుకుంది. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి సుతారిగూడకు చెందిన వరగంటి శైలజ(25) రెండేళ్లుగా ఓ అబ్బాయి ప్రేమలో ఉండగా కొన్ని రోజులుగా అతడితో మాట్లాడటం మానేసింది. ఈ నెల 9న రాత్రి సమయంలో . ప్రేమించిన యువకుడు మద్యం మత్తులో శైలజ ఇంటికి వచ్చి బూతులు తిట్టి వెళ్లిపోయాడు. దీంతో మరుసటి రోజు 10వ తేదీన మధ్యాహ్నం ఇంట్లో చెప్పకుండా శైలజ వెళ్లిపోయింది. ఇంట్లో లెటర్‌ కనిపించింది. అందరి ముందు నా పరువు పోయింది, నేను ఇంట్లో నుంచి వెళ్లిపోతున్నా.. నా కోసం వెతకకండి అంటూ శైలజ లేఖలో పేర్కొంది. దీంతో కుటుంబికులు మేడ్చల్‌ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



శైలజ(ఫైల్‌)

ఫోన్‌ రావడంతో బయటకు వెళ్లి..

ఫోన్‌ రావడంతో ఇంట్లో నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన కండ్లకోయలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొండం వెంకటేశ్వరి(22) కొంత కాలంగా ఓ అపార్ట్‌మెంట్‌లో హౌస్‌ కీపింగ్‌ పనులు చేస్తోంది. కాగా ఈ నెల 7వ తేదీన రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులంతా కూర్చొని మాట్లాడుకుంటుండగా ఆమెకు ఫోన్‌ వచ్చింది. దీంతో ఫోన్‌ మాట్లాడుకుంటూ ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబికులు మేడ్చల్‌ పోలీసులను ఆశ్రయించారు. మేరకు మిస్సింగ్‌ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



వెంకటేశ్వరి(ఫైల్‌)

రేవంత్‌రెడ్డి నన్ను బ్లాక్‌మెయిల్‌ చేశాడు

- రైతుల జోలికొస్తే ఊరుకోం..
- మంత్రి చామకూర మల్లారెడ్డి

మేడ్చల్‌ రూరల్‌: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతుల కరెంటుపై అమెరికా వెళ్లి మాట్లాడటం ఏమిటని మంత్రి మల్లారెడ్డి ప్రశ్నించారు. ఎన్నికలకు ముందుకు అమెరికా వెళ్లింది డబ్బుల కోసమేనని ధ్వజమెత్తారు. బుధవారం మేడ్చల్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్‌ ధర్నా, రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. రేవంత్‌రెడ్డి గతంలో తనను కూడా బ్లాక్‌మెయిల్‌ చేశాడని, ఇది అందరికీ తెలిసిందేనన్నారు. టీడీపీని నాశనం చేసిపోయాడని, ఇప్పుడు కాంగ్రెస్‌ను కూడా సత్తెనాశ్‌ చేసి పోతాడన్నారు. 130 ఏళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్‌ పార్టీ ఓ దొంగకు టీపీసీసీ పదవి ఇవ్వడమేంటన్నారు. కాంగ్రెస్‌ పార్టీకి దిక్కులేదని, పార్టీని ఎవరో ఒకరు నడిపించాలని కాబట్టి రేవంత్‌ ఎవరో ఒకరిని లూటీ చేసి పార్టీని నడిపిస్తాడనే అతడికి పదవి ఇచ్చిందన్నారు. రైతులపై ఎవరైనా ఇష్టానుసారంగా మాట్లాడితే వారి నాలుకలు చీరుతామన్నారు. దేశమంతా కూడా కిసాన్‌ సర్కార్‌ రావాలని బీఆర్‌ఎస్‌కు మద్దతు పలుకుతున్నాయని తెలిపారు. మేం రిజెక్ట్‌ చేసిన వారిని పార్టీలో చేర్చుకుంటున్నారు. కార్యక్రమంలో మెదక్‌ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ శ్రేణులు పాల్గొన్నారు.

కీసర, నాగారం, దమ్మాయిగూడలో..

కీసర: రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ సరఫరాపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో కీసర మండలం, నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో నిరసన చేపట్టి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. జెడ్పీ వైస్‌చైర్మన్‌ బెస్త వెంకటేష్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ రామిడి ప్రభాకర్‌రెడ్డి, నాయకపు మాధురి వెంకటేష్‌, కీసర మండల బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, నాగారం మున్సిపల్‌ బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్‌, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ బండారి మల్లేష్‌ యాదవ్‌, సర్పంచ్‌ మోర రవికాంత్‌, మాజీ ఎంపీపీ సుజాత, జంగయ్యయాదవ్‌, మల్లేష్‌, రమేష్‌గుప్తా, సాయియాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్‌లో బీఆర్‌ఎస్‌ ధర్నా సందర్భంగా మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి



కీసరలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్‌ఎస్‌ నేతలు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సాక్షి, మేడ్చల్‌ జిల్లా: మధ్యాహ్న భోజన కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ప్రకటించి, అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌ డిమాండ్‌ చేశారు. అక్రమ తొలగింపులు అరికట్టి, రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. బుధవారం మేడ్చల్‌ కలెక్టర్‌ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకానికి వంట షెడ్లు ఏర్పాటు చేసి, వంట పాత్రలు ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, యూనిఫామ్స్‌ అందజేయాలన్నారు. కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్‌, ప్రమాద బీమా, ఈఎస్‌ఐ, పీఎఫ్‌ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలకు అప్పజెప్పే ప్రభుత్వ కుట్రలను సీఐటీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఉన్ని కృష్ణన్‌ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు కేసీఆర్‌ అసెంబ్లీలో ఏడాది కిందట ప్రకటించినట్లుగా పెంచిన రూ.2 వేలు వెంటనే అందజేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులను తక్షణమే ఇవ్వాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై జిల్లా కలెక్టర్‌, విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళనకు కాంగ్రెస్‌ నేతలతో సహా విపక్షాలు మద్దతు ప్రకటించినట్లు ఉన్నికృష్ణ పేర్కొన్నారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా నాయకుడు బంగారు నర్సింగరావు, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా నాయకులు ప్రేమలత, సువర్ణ, మంగా, సుజాత, షాహిన్‌, పుష్ప పాల్గొన్నారు.

వ్యవసాయం చేయకుండా కాల్వ కబ్జా చేశాడు



కబ్జా యత్నం జరుగుతున్న బాధితుల తాత, పెదనాన్న సమాధులు

ఘట్‌కేసర్‌: తమ పట్టా భూమిలో వ్యవసాయం చేయనీయకుండా కాల్వను కబ్జా చేశాడని బాధితులు సరస్వతి, సత్యనారాయణ, సంతోశ్‌గౌడ్‌ అన్నారు. కొర్రెముల్‌ సర్వే నంబర్‌-398లోని పట్టాభూమి వద్ద బుధవారం వారు మాట్లాడుతూ తమలో ఒకరి దగ్గర భూమిని కొనుగోలు చేసి భూమి పార్టీషన్‌ లేకుండానే తాత, పెద్దనాన్న సమాధులు తొలగించి భూమిని చదును చేసి కబ్జా చేశాడని ఆరోపించారు. తమ 21 గుంటల పొలంలోకి వెళ్దామంటే తామే వెళ్లే దారిలో ప్రహరీ నిర్మించి మా భూమిని అమ్మాలని మాపై ఒత్తిడి తెస్తున్నాడని, ప్రశ్నిస్తే ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకోమని బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. భూమిని అమ్మాలని దివ్యాంగుడైన తమ తండ్రి, వృద్ధురాలైన తల్లిపై దాడి చేసేందుకు యత్నిస్తున్నాడని సంతోశ్‌గౌడ్‌ ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి పట్టా భూమిని సర్వే చేసి కబ్జా చేయాలని యత్నిస్తున్న వ్యక్తి నుంచి తమను కాపాడాలని బాధితులు కోరుతున్నారు.

రేవంత్‌రెడ్డి మాటలను బీఆర్‌ఎస్‌ వక్రీకరిస్తోంది

టీపీసీసీ అధికార ప్రతినిధి హరివర్ధన్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్‌: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాటలను వక్రీకరించి బీఆర్‌ఎస్‌ పార్టీ పబ్బం గడుపుకోవాలని చూస్తోందని టీపీసీసీ సీనియర్‌ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌ పార్టీ పిలుపు మేరకు బుధవారం మేడ్చల్‌ పారిశ్రామికవాడలోని విద్యుత్‌ కార్యాలయం వద్ద కాంగ్రెస్‌ శ్రేణులు ధర్నా నిర్వహించారు. అనంతరం 44 జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించి సీఎం కేసీఆర్‌ దిష్టిబొమ్మను దహనం చేశారు. ధర్నాలో పాల్గొన్న హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌లా జూటా మాటలు చెప్పి రైతులను మోసం చేయడం కాంగ్రెస్‌ పార్టీకి తెలియదన్నారు. కాంగ్రెస్‌ పార్టీ మాట ఇస్తే మడమతిప్పకుండా నిలబడుతుందని, బీఆర్‌ఎస్‌ పుట్టకముందే కాంగ్రెస్‌ పార్టీ రైతులకు ఉచితంగా విద్యుత్‌ అందించిందన్నారు. విద్యుత్‌ సంస్థలతో సీఎం బంధువులు లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని అధిక ధరలకు కరెంట్‌ కొనుగోలు చేసి ప్రజలపై భారం మోపుతున్నారని విమర్శించారు. 24 గంటల ఉచిత కరెంట్‌ ఇస్తున్నామని చెబుతున్న బీఆర్‌ఎస్‌ నాయకులు నిజంగా కరెంట్‌ ఇస్తున్నారో లేదో గుండెపై చేయివేసుకుని చెప్పాలని, ఏ రైతును అడిగినా 24 గంటల కరెంట్‌ సరఫరా కావడం లేదని చెబుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్‌ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, మున్సిపల్‌ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, భూషణం, బీపీటి రాజు, శంకర్‌గౌడ్‌, మేడ్చల్‌, శామీర్‌పేట్‌ మండలాల నాయకులు పాల్గొన్నారు.



మేడ్చల్‌లో విద్యుత్‌ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్‌ శ్రేణులు